క్లుప్తంగా

చేప పిల్లల విడుదల



పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు

చింతలపూడి: రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో మత్స్య శాఖ అధికారులు సోమవారం తమ్మిలేరు లోనికి చేప పిల్లలను విడుదల చేశారు. తమ్మిలేరు రిజర్వాయర్‌లో 3 లక్షలు, చింతలపూడి పెద్ద చెరువులో 50 వేలు, ఎండపల్లిలోని లింగసముద్రం చెరువుల్లోల్ల 1.20 లక్షల చేప పిల్లలను విడుదల చేసినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి నాగలింగాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నరసయ్య, చింతలపూడి డిప్యూటీ తహసీల్దార్ షకిలున్నీసా, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుని ఆలయంలో ధ్వజారోహణ



ధ్వజ పటాన్ని ఎగురవేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శివదేవుని కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వేదపారాయణలు, స్వామి వారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలను అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వరపూజ, శైవ పుణ్యహావాచన, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశన, ప్రతిష్ఠాపన, అంకురార్పణను అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద మంత్రోచ్చరణల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు రమణరాజు, దుర్గాప్రసాద్, దాతలు, తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు అంకురార్పణ పూజలు



మహాశివరాత్రి అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొయ్యలగూడెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం అంకాలగూడెం ఉమా సమేత బోగలింగేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ పూజలు ప్రారంభించారు. గణపతిపూజ, మండపారాధన, పంచగ్రవ్యసేవ, పుణ్యాహవచనం పూజలను బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి శివానందాచార్యులు, శివకుమార్‌ల పర్యవేక్షణలో నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి స్వామివారికి నిత్య పూజలు నిర్వహించారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

టి.నరసాపురం: అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం తోరణాలు కట్టి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అన్నదాన భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సై జయబాబు మాట్లాడుతూ వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ రాజు, పసుమర్తి రాము, పర్వతనేని మురళి, లింగరెడ్డి శ్రీనివాస్, మణికంఠ, వెజ్జు రాజు, కొప్పాల బద్రి, చేబోలు తాతారావు, పర్వతనేని ప్రశాంత్ రవి పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేరువేరుగా సోమవారం రూ.2,00,116లను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరు జిల్లా, జోగన్నపాలెంకు చెందిన బలుసు పుల్లయ్య రూ.1,00,116, అలాగే హైదరాబాద్‌కు చెందిన తోట నాగేశ్వరరావు రూ.1,00,000 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

చింతలపూడి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. ధర్నాలో జూపూడి వసంత, ఎస్‌కే సుభాని, కృష్ణ, కోరాడ హరిబాబు, కాగితాల రామకృష్ణ పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న వీరేశ్వరుడు

- దక్షిణ కాశీగా తాడువాయి వీరేశ్వరస్వామి ఆలయం
- పట్టిసంలో భారీ ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం: మహాశివరాత్రి పర్వదినం వస్తే జంగారెడ్డిగూడెం మండలంలో భక్తులు దర్శించి తరించే ప్రసిద్ధ శైవక్షేత్రం తాడువాయి శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరేశ్వరస్వామి వారి ఆలయం. శివసంకల్పిత స్వప్రతిష్ఠితమూర్తిగా స్వయంభువుగా కొలువైన స్వామి వారిని శివరాత్రి పర్వదినాన జంగారెడ్డిగూడెం మండలంతో పాటు చుట్టుపక్కల మండలాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు వచ్చి వీరేశ్వరస్వామిని దర్శించుకుంటారు. గ్రామీణ నేపథ్యంలో, ప్రకృతి రమణీయత మధ్య ఎర్ర కాలువ జలాశయం ప్రక్కన అలరారుతూ ఉండే శైవక్షేత్రంలో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఐదు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఐదు రోజుల తిరునాళ్లను తిలకించేందుకు, స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారు. దేవదాయ, ధర్మదాయశాఖ, ఆలయ ఉత్సవ కమిటీ శివరాత్రికి ఏర్పాట్లు చేశారు. కాగా ఈ ఐదు రోజులూ ధార్మిక సేవలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా మూడో రోజు స్వామి వారి కళ్యాణం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచుతుంది.

నిత్యం ధూపదీప నైవేద్యాలు

నిత్య ధూపదీప నైవేద్యాలు, అభిషేకాలతో భక్తుల కొంగు బంగారంగా శ్రీభద్రకాళీ సహిత వీరభద్ర స్వామిని భక్తులు దర్శించుకుంటారు. స్వయంభు క్షేత్రంలో చేసే ఏ ధార్మిక క్రతువయినా ఎంతటి ఫలితాలు ఇస్తుంది అన్నది మాటలకందని గొప్ప దివ్యానుభూతి. జంగారెడ్డిగూడెం-అశ్వారావుపేట మధ్య ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులకు దగ్గరలో భక్తుల ఇష్టపాప్తికి పెన్నిధిగా తాడువాయి శైవక్షేత్రం భాసిల్లుతుంది.

శివకేశవుల ఆరాధన పట్టిసం విశిష్టత

పోలవరం రూరల్: మహేశ్వరుడు వీరేశ్వరస్వామిగా, భద్రకాళీ సమేతంగా నెలవైన ఈ శివక్షేత్రంలో భూదేవి సమేత భావన నారాయణస్వామి క్షేత్రపాలకుడు కావడంతో శివకేశవుల ఆరాధన పట్టిసం శివక్షేత్రం విశిష్టత. తొలుత ప్రసిద్ధిగాంచిన ఈ శివక్షేత్రం అఖండ గోదావరి నది మధ్య సహజ సిద్ధంగా వెలసిందని చెప్పబడుతుంది. పంచ శివక్షేత్రాల్లో పట్టిసం శివక్షేత్రం ఒకటిగా ప్రసిద్ధి గాంచింది. కాశీ, కేదారం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, పట్టిసం పంచ శివక్షేత్రాలు. ఎత్తైన పర్వత శిఖరం. చుట్టూ గోదావరి నది వెరసి ఈ పట్టిసం శివక్షేత్రాన్ని దర్శించుకునే భక్తులకు దైవదర్శనంతో పాటు ఈ క్షేత్రం ఆహ్లాదాన్ని కూడా కలిగిస్తుంది. విద్యుత్ వెలుగుల మధ్య దేదీప్యమానంగా కాంతులీనుతూ భక్తులకు కనువిందు చేస్తుంది. పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి శివరాత్రి పర్వదినాన పితృదేవతలకు తర్పణాలు అర్పించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. కొత్త దంపతులతో సరిగంగ స్నానాలు ఆచరింపచేయడం ఆనవాయితీ. రాష్ట్రంలోని ఇతర శైవ క్షేత్రాల కన్నా భిన్నమైన క్షేత్రప్రాశస్త్యం కలిగిన పట్టిసాచల క్షేత్రాన్ని దర్శించుకోవడంలో భక్తులు ప్రత్యేక అనుభూతిని పొందుతారు.

పర్యాటక క్షేత్రంగా

గోదావరి మధ్య దేదీప్యమానంగా విరాజిల్లుతున్న పట్టిసీమ ఇటీవల కాలంలో పర్యాటక ప్రదేశంగా మారింది. ఆలయ సమీపంలోని మహానందీశ్వర స్వామి ఆలయం, గండిపోశమ్మ ఆలయం, కొరుటూరు రిసార్ట్, పాపి కొండలు వంటి ప్రదేశాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. టూరిజం బోట్లలో ప్రయాణిస్తూ గోదావరి అందాలను తిలకిస్తూ పర్యాటకులు మధురానుభూతి పొందుతారు.




జంగారెడ్డిగూడెం: భద్రకాళీ అమ్మవారు



పోలవరం రూరల్: భావన నారాయణ స్వామి



పోలవరం రూరల్: పట్టిసం వీరేశ్వరస్వామి



జంగారెడ్డిగూడెం: భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయం



తాడువాయి వీరేశ్వరస్వామి వారు →

పిచ్చి కుక్క దాడిలో నలుగురికి గాయాలు

చింతలపూడి: మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కుక్క నలుగురిపై దాడి చేసిందని తెలిపారు. పిచ్చి కుక్క దాడిలో గాయాలపాలైన బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని కిష్టారం గ్రామంలో సోమవారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నాటుసారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి నాలుగు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ కె.శ్రీనుబాబు, ఎస్సై జి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పిడి శ్రీనుకు అభినందన



ముప్పిడి శ్రీనును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన ముప్పిడి శ్రీనును కామవరపుకోట వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. సోమవారం జంగారెడ్డిగూడెంలో ముప్పిడి శ్రీనును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహనరావు, గుర్రాల రవికుమార్, నానాది సాగర్, కిరణ్, దొడ్డిగర్ల చిట్టిబాబు, పెనుమాల నాగభూషణం, కామవరపుకోట వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిజాతగిరి ఆలయ టెండర్లు ఖరారు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిత్యపూజా కైంకర్యాల నిర్వహణ నిమిత్తం సరుకులు సరఫరా చేసే టెండర్లను ఏలూరు దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్ ఖరారు చేశారు. సోమవారం ఆలయంలో సీల్ టెండర్లను తెరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ టెండర్లను ఒక సంవత్సర కాలానికి అనగా ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 వరకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. శ్రీవిజయ జనరల్ స్టోర్స్, స్వామి వారి అలంకరణ నిమిత్తం పూలదండలు, పూలు రోజా అందించేందుకు శ్రీఅంబికా ఫ్లవర్ స్టాల్స్, అన్నప్రసాదం, స్వామి వారి అభిషేకాల నిమిత్తం పాలు, పెరుగు, కూరగాయలు సరఫరా చేసేందుకు శ్రీచక్ర ఏజెన్సీకి టెండర్లు ఖరారు చేసినట్లు తెలిపారు.



పారిజాతగిరిలో టెండర్లను ఖరారు చేస్తున్న ఆలయ అధికారులు

దేవదాయశాఖకు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం

జంగారెడ్డిగూడెం పంచాయతీ రాజ్ కార్యాలయ ప్రాంగణంలో కొలువైన శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఆ శాఖ ఏలూరు తనిఖీ అధికారి వి.సురేష్‌కుమార్ సోమవారం ఆలయాన్ని సందర్శించి, ఆలయ హుండీలకు సీల్ వేశారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణంపై వివాదం

జంగారెడ్డిగూడెం: శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణంపై వివాదం చోటు చేసుకుంది. సోమవారం పట్టణంలోని రామచంద్రాపురం పశువుల ఆసుపత్రి పక్క రోడ్డులో చెరువు భూమిలో ఉన్న శ్మశాన వాటికకు ఓ వర్గం వారు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీనిని అక్కడి స్థానికులు అడ్డుకున్నారు. చుట్టూ ఇళ్లు ఉన్న ప్రాంతంలో శ్మశాన వాటికను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను చక్కదిద్దారు. రామచంద్రాపురానికి చెందిన పలువురు పెద్దలు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో శ్మశాన వాటిక ఉందని, దానిని అభివృద్ధి చేసే నిమిత్తం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. అయితే ఇళ్ల సమీపంలో శ్మశాన వాటిక ఉండటం, అంత్యక్రియల కార్యక్రమాలు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని మరో వర్గం ఆరోపిస్తుంది. కాగా, స్మశాన వాటికను వేరేప్రాంతానికి మార్చాలని కోరుతూ మహిళలు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు.



వివాదం జరుగుతున్న దృశ్యం

చిన్నారులకు చదువుపై ఆసక్తి కలిగించాలి

- జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పంకజ్ కుమార్

లింగపాలెం: చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పంకజ్ కుమార్ అన్నారు. మండలంలోని సింగగూడెం హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఈయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీసీ పంకజ్ కుమార్ మాట్లాడుతూ పిల్లల్లో గుణాత్మక విద్యను అందించేందుకు పాటుపడాలని, అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు విడతలుగా నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఐదో రోజు శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలను పలు ప్రశ్నలను అడిగారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో జే రవీంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్ర శ్రీధర్, రిసోర్స్ పర్సన్లు ఎస్.తిరుపతి, కేవీవీ సత్యనారాయణ, బి.కిషోర్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ ఎం.కుమారి, సీఆర్‌ఎంటీలు టి.కనకరాజు, జి.కుమార్ మంగళం, టి.సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాన్ని పెంచాలి

పోలవరం రూరల్: చిన్నతనం నుంచే అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించేలా రూపొందించిన కార్యక్రమమే జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణా కార్యక్రమం అన్నారు. పోలవరం ప్రభుత్వ హైస్కూల్‌లో జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కేంద్రాన్ని ప్రథమ్ స్టేట్ ట్రైనింగ్ అసోసియేట్ పి.చిన్నిబాబు సందర్శించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు మూర్తి, వజీర్, స్వామి అయ్యప్ప, రాణి, మాధవి, విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు కె.లక్ష్మీకాంతం, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతిని సద్వినియోగం చేసుకోండి

జంగారెడ్డిగూడెం: చిన్నారుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా జ్ఞాన జ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీవో పి.బ్యూల అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం ఐదో రోజు నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక భాగస్వామ్యం అనే అంశంపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్యూల మాట్లాడుతూ శిక్షణలో తెలియజేసే అంశాలను అమలు చేయడం ద్వారా పునాది దశలోనే చిన్నారులకు మెరుగైన విద్యను అందించి మంచి ఫలితాలు సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ మాస్టర్ ఎస్‌ఖే అజీజ్, డీఆర్‌పీలు కృషివలరావు, శ్రీనివాస్, ఎస్‌కే షరీఫ్, సూపర్‌వైజర్లు కె.లక్ష్మి, ఎం.విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ జ్ఞాన జ్యోతి

కొయ్యలగూడెం: జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా సోమవారం కొయ్యలగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐదో రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ పీవో తులసి సందర్శించారు. శిక్షణ ఇచ్చే వారికి తన విలువైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో సరస్వతి, ఎస్.శివరామహరిప్రసాద్, ఎస్‌కే రఫీ, సీహెచ్ పాండురంగ, వెంకట రమణ, ప్రసన్న, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



లింగపాలెం: శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీసీ పంకజ్ కుమార్



కొయ్యలగూడెం: కార్యక్రమంలో మెటీరియల్ ప్రదర్శనను పరిశీలిస్తున్న పీఓ తులసి



జంగారెడ్డిగూడెం: జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



పోలవరం రూరల్: శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పి.చిన్నిబాబు

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

జంగారెడ్డిగూడెం: అన్యమత ప్రచారానికి పాల్పడుతున్న హెచ్‌ఎంను వెంటనే సస్పెండ్ చేయాలని మండలంలోని లక్కవరం రెడ్డిపేట ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలను బహిష్కరిస్తూ తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డిపేట ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం బి.సుబ్రహ్మణ్యం తరగతి గదుల్లో అన్యమత ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఈ నెల 14వ తేదీన తల్లితండ్రులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించిన ఎంఈవో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. అయితే ఇప్పటి వరకు హెచ్‌ఎంపై ఎటువంటి చ్యలు తీసుకోకపోవడంతో సోమవారం తల్లింద్రులు పాఠశాల వద్ద ఆందోళన చేసి, విద్యార్థులను తీసుకెళ్లిపోయారు. హెచ్‌ఎంను సస్పెండ్ చేసేంత వరకు తమ పిల్లలను పాఠశాలకు పంపేది లేదని తల్లితండ్రులు తేల్చి చెప్పారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే గ్రామంలో ఉన్న అన్ని పాఠశాలల వద్ద ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంఈవోలు బి.రాముడు, జి.రాములు సోమవారం సాయంత్రం పాఠశాలకు చేరుకుని తల్లితండ్రులతో మాట్లాడారు. సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లితండ్రులు

జీతాలు మున్సిపల్ శాఖ నుంచి చెల్లించాలి

చింతలపూడి: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది జీత భత్యాలను మున్సిపల్ శాఖ నుంచి చెల్లించాలని ఏఐటీయూసీ, సీఐటీయూసీ, సీఐటీయూల అనుబంధ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు నగర కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ డి.పావనికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సత్యనారాయణ, తోర్లపాటి బాబులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆప్కాస్ విధానం ద్వారా మున్సిపల్ కార్మికులకు జీతాలు ఒకటి లేదా రెండో తేదీనే అందేవని, కాంట్రాక్ట్ ఏజెన్సీలకు ఈ బాధ్యతను అప్పగిస్తే జీతాలు రెండు మూడు నెలలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల జీత భత్యాలు ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచనను విరమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంచర్ల గురవయ్య, చేపల శ్రీనివాసరావు, వెలగాడి అనురాధ, వెలగాడి పద్మ, వడిత్య బాలు, చిన్నయ్య, వలి, మరియదాసు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

ద్వారకాతిరుమల: అబద్ధపు హామీలిచ్చి ప్రజలను, నిరుద్యోగ యువతను మోసగించిన కూటమి ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూలగొట్టి, గుణపాఠం చెప్పాలని మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు, కాంగ్రెస్ యువ నాయకుడు జీవీ శ్రీరాజ్ పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతతో కలిసి సోమవారం ఆయన ద్వారకాతిరుమల చినవెంకన్నను దర్శించారు. అనంతరం నిరుద్యోగ యువతతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు కావాలన్న ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, జి.కొత్తపల్లి ఎంపీటీసీ బిరుదుగడ్డ బజారియ్య, మానుకొండ సుబ్బారావు, కాజు రవి, పొంగులేటి సంతోష్, పున్నపు కృష్ణ, బోడ అశోక్, పొంగులేటి కేశవ, నూనె గోపి, గంజి నాగార్జున, పవన్, అంజి పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: మేనిఫెస్టోను చూపుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు శ్రీరాజ్

ఎమ్మెల్సీ అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు ప్రచారం

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు జంగారెడ్డిగూడెంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చింతలపూడి నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఎవరూ పోటీ చేయలేదని, తొలిసారిగా తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని, అందుకు అవకాశం కల్పించాలని కోరారు.

పొగాకు గ్రేడింగ్‌లో వ్యర్థాలను తొలగించాలి

బుట్టాయగూడెం: పొగాకు గ్రేడింగ్‌లో వ్యర్థాలు లేకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1 ఆక్షన్ సూపరింటెండెంట్ జి.శ్రీహరి అన్నారు. మండలంలోని దొరమామిడి, ముప్పినవారిగూడెం, బుట్టాయగూడెం గ్రామాల్లో సోమవారం బోర్డు అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేస్తున్న పొగాకు క్యూరింగ్ పనులు పరిశీలించారు. అదే విధంగా పలు చోట్ల పొగాకు పంటలు కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రం పరిధిలో పలు పొగాకు పంటలను పరిశీలించారు. అవి బాగానే ఉన్నాయని చెప్పారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి క్యూరింగ్, గ్రేడింగ్ చేయాలన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో 190 అక్రమ బేరన్లు నిర్మించినట్లు గుర్తించామన్నారు. అక్రమంగా బేరన్లు నిర్మించిన రైతులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. అదే విధంగా రెవెన్యూ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ కె.సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



పొగాకును పరిశీలిస్తున్న అధికారి

అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం: మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఏఐటీయూసీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్‌తో కలిసి బుచ్చిబాబు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ విధానం వల్ల ఏ కార్మికుడు మేలు పొందిన పరిస్థితి లేదన్నారు. డిమాండ్ల సాధనలో భాగంగా మార్చి 3వ తేదీన చలో కలెక్టరేట్, 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంపన వెంకటరమణ రమణరాజు, కుంచె వసంతరావు, కంతేటి వెంకటరావు, దోసూరి నాగరాజు, కొత్తూరి నాగేశ్వరావు, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బుచ్చిబాబు